
# కర్త-కర్మ-క్రియ



ఆమె నడుస్తూ ఉంది!

తనచుట్టూ తాను చుట్టుతూ సూర్యుడిచుట్టూ చుట్టే భూమి నడుస్తూ ఉంది. ఆ భూమి మీద మనుషులు నడుస్తున్నారు. ఆ మనుషుల్లో నడవలేక నడవలేక కుంటివాళ్ళు నడుస్తున్నారు. గుడ్డివాళ్ళు నడుస్తున్నారు. జంతు జాలాదులు నడుస్తున్నాయి. ఈ లోకమే నడుస్తూ ఉంది. ఇది ఆగని నడక! ఎందుకీ నడక? ఎక్కడ దీని గమ్యం?–

సామాన్య మానవుడికి అర్థం కాని ప్రశ్న! అందరి బుర్రలను వేడెక్కించిన వేడెక్కిస్తున్న వేడెక్కించే ప్రశ్న!! అసలు గమ్యం ప్రసక్తివస్తే–

'ఈ ప్రపంచమంతా మిథ్య. అందులో మనం నిమిత్తమాత్రులం'– అని వాదించే వేదాంతి, 'ప్రకృతి అంతా శాస్త్రమయం, ప్రతి అణువులోను మానవాభ్యుదయానికి ఉపకరించే ఏదో మహత్తరశక్తి ఇమిడివుంది'– అని భావించే ప్రగతి కాముకుడైన శాస్త్రజ్ఞుడు 'జుట్లు' పట్టుకొంటారు. శాంతికాముకుడైన సామాన్యుడు 'జుట్లు' పట్టించి వేడుక చూడలేడు.

ఉన్నదానితో సరిపెట్టుకోవడం అతడి సర్దుబాటుతత్త్వం. ఎవరు ఎలా నడిచినా ఎటునడిచినా- కేవలం కూటికోసమే అంటాడు.

అందుకే ఆమెగూడ నడుస్తూ ఉంది! అదే జానెడు పొట్టకు పిడి కెడు కూటికోసం!

జానెడు పొట్ట! .....పిడికెడు కూడు!!

ఎన్ని వేషాలు?........మరెన్ని మోసాలు??.....

తలలుమార్చేవా డొకడైతే, తలగుడ్డలు మార్చేవా డొకడు. గడప గడప తిరిగే దొకడైతే, గడప గడపను చెమటతో కడిగేవా డొకడు. అభిమానంతో అవస్థపడే దొకడైతే, మానాన్ని అమ్ముకొని బతికేవాడొకడు. అయితే అందరూ సంఘజీవులే!

'ఎందుకీ తారతమ్యం?' అంటే 'కర్మ' అంటాడు వేదాంతి. చేతగాని తనమంటాడు శాస్త్రవేత్త. ఒక జన్మలో చేసింది మరొక జన్మలో అనుభవించడం యుగధర్మమైతే, ఆ చేత్తోచేసి ఈ చేత్తో అనుభవించడం కలియుగ ధర్మమంటాడు సామాన్యుడు చాల తేలిగ్గా!

లేకపోతే, ఎవరిజోలి అక్కరలేకుండా, ఏ మూలనో ఒకమూల, జపమాల తిప్పుకొంటూ దర్భాసనంమీద దర్జాగా కూర్చుంటే, కనుసన్నలు రాజ్యమేలవలసిన వయస్సులో, కాళ్ళీడ్చు కుంటూ... ఎందుకు ఆమె నడుస్తూ ఉంది?- ప్రశ్నకుప్రశ్నే సమాధానం అయితే ఇక చదవండి-

"బాబూ! నేను చాలా మెతకవాణ్ణి, 'అందరూ మనుషులే! ఆనందం అందరి సొమ్ము?' అని నా అమృతహస్తమెత్తి ఆశీర్వదించబోతే... తిన్నయింటికి వాసాలెంచే మనుషులు... నన్నే తూట్లు పొడుస్తున్నారీ రాకెట్లతో! నాగతి నీకు పట్టకుండా చూసుకో!" అని హెచ్చరించినట్లుంది చంద్రుడు సూర్యభగవానుణ్ణి. కోపాగ్నిజ్వాలలు కక్కుతున్నాడా మహానుభావుడు. ఆ ధాటికి తట్టుకోలేక వడలిపోతూ ఉంది చెట్టూచేమా. హడలిపోతున్న గొడ్డూగోద కాసంత చెట్టునీడకై తాపత్రయపడుతూ ఉంది. అయితే ఆమె మాత్రం...

అందీ అందని చీరకొనకొంగు చాలీచాలని చుట్ట...ఆ చుట్టపై పెద్ద బుట్ట.....ఆ బరువు ఉచ్చిపీకుతూ ఉంటే... మనసు వచ్చీరాక మాదిగరాముడు కుట్టిచ్చిన జతజోళ్ళలో ఒకజోడు పట్టెడ ఒకతీట్ర తీగగా మారితే... ఆ జోడు కాలికిరాకుండా ముప్పుతిప్పలు పెడుతుంటే... ఆ కాలిబాటలో గులకరాళ్లు వేమనగారిపద్యాన్ని మననం చేసుకోమని హెచ్చరిస్తూ ఉంటే... ఎప్పుడో వేకువజామున మూడు మెతుకులు విదిల్చి... ముంత మూడుచుట్లు తిప్పి... నోట్లో పోసుకున్న దోసెడు కూటినీళ్లు చెమటగా మారితే... కాలేకడుపులో లేచిన ఉచ్ఛ్వాస నిశ్వాసాలతో నాలుక పిడచకట్టుతుంటే- కాలుదీసి కాలుపెడుతూ ఉంది! అంటే- ఆమె నడుస్తూ ఉంది!!

ఇక కనుచూపుమేరలో ఈ కాలిబాట ఒక బండిబాటతో కలుస్తుంది, పిల్లకాలవలు పెద్దనదిలో చేరినట్లుగా! అక్కడ ఏ మహానుభావుడో, ఈలాంటి అభాగ్యులపాలిట దేవుడు- రెండు నిలువురాళ్ళు పాతి వాటిపై అడ్డంగా ఒక బండను అమర్చాడు. నెత్తి బరువు దించుకొనేదానికి, కాస్త ఊపిరి పీల్చుకొని, ఆ మీదట నెత్తికెత్తుకొనేదానికి. జనసంచారములేని ఆ ప్రదేశాల్లో ఎంతైనా ఉపకరిస్తుందీ బండ. సువర్ణాక్షరాలతో లిఖించి పేరు సార్థకపరచు

కోవడానికి ఈ ఉపకరణం, ఈ యుగధర్మంకాదు. కాగా ఆ పుణ్యాతుడి పుట్టు పూర్వోత్తరాలు గుప్తంగానే ఉండిపోయాయి. అంతేగాదు- ఆ పక్కన ఒక రావి చెట్టును నాటాడు అదే చేతులతో. అది మహావృక్షమై ఆశ్రితజన రక్షగా ఉంది. వడలిపోయిన ఆకులు సందునుండి పొడలు పొలుగా పడుతున్న వడధాటకి తట్టుకోలేక ఆ చెట్టుకిందనుండి బయలుదేరిన కాషాయ వస్త్రధారి, "ఎవరు చేసిన కర్మ వాళ్ళనుభవింపక తప్పదన్నా!" అని పాడు కొంటూ ఎండనపడ్డాడు.

పారిజాత పరిమళం... మల్లెల సౌరభంతో మత్తెక్కి సౌందర్యోపాసకుడైన భావుకునికంట ఇలాంటి సంఘటనలు పడడం అరుదు. అధవా పడినా చీదరించు కొంటాడేమోగానీ, ప్రగతి కాముకుని ఎదటబడితే, "ఓ వృద్ధనారీ! నమస్కారం. బట్ట మడతపడకుండా పొట్టగడవాలి" అని వెర్రిమొర్రి వేషాలువేసే ఈ కాలం సోమరిమూకకు నీవు ఆదర్శం. ఈ భారతావని శోభాయమానంగా వెలుగొందాలంటే, నీలాంటి కర్మయోగులే అవసరం! రా తల్లీ! రా!! ఈ బండమీద ఆ బుట్టను దించి, ఆ చెట్టు నీడన కాసేపు సేదదీర్చుకో!" అనక మానడు.

ఆమె నిలువురాళ్ళను సమీపించింది, ఆ ప్రగతికాముకుని ఆహ్వానం మీద కాదు - అది ఆమె దినచర్య కాబట్టి! బుట్టను బండమీద దించింది. ఉసూరుమంటూ ఆ చెట్టునీడలో చతికిలబడింది.

కనుచూపు మేరలో చెట్టుగానీ, గుట్టగానీ లేనీ ఆ పొడిపొడిచెట్ల బయల్లో వడగాలి ధాటికి గూబలు'గుఁయ్' మంటున్నాయి. ఎండధాటికి తట్టుకోలేక పక్షులు ఆ రావిచెట్టు ఆకులమాటున తలదాచుకొంటున్నాయి. ఏటేటా వేసవిలో రైతులు కాస్త ఊపిరిపీల్చుకొనే సమయంలో అక్కడికి రెండుమైళ్ళ దూరంలో ఉన్న నల్లవెంగనపల్లెతో వెంగమనాయుడి ధర్మమంటూ భారతోత్సవాలు వైభవంగా జరగతాయి. ఆ ఉత్సవాల్లో పగటికథ ఓ తంతు!... అంటే, ఓ పండితోత్తముడు భారతమంత ఉద్గ్రంథాన్ని- పసిపిల్లవాడు నిముషానికొక్క చెరకు గణుపు తిన్నట్లు పద్దెనిమిది రోజుల్లో పారాయణం చేస్తాడు. ఆ కథను వినాలనుకొన్న చుట్టు పక్కల పల్లెవాసుల కదేదారి. అందుకే ఒకటీ అర ఆ రోడ్డుమీద పడ్డారు.

ఆమె!... మాడీ లచ్చుమక్క! ఒకప్పుడు మహడీ లక్ష్మమ్మ! ఆ మారుమూల పల్లెల్లో తొలిసారిగా మహడీ కట్టుకొనే భాగ్యం ఆ ఇంటికే కలిగింది. కనుక, అలాంటి కట్టడాన్ని కూడా చూడనోచుకోని పల్లె ప్రజలు, అదివరకు తరతరాలుగ వస్తున్న ఇంటిపేరును కాస్త అవతలికితీసి, ఆస్థానంలో మహడీని తగిలించారు. ఆ నాటినుండి ఆ ఇంటికి మహడీ వాళ్ళన్న పేరు సార్థకమైంది. కాలగమనంలో!- 'మహడీ' మంది నోళ్ళల్లో పడి 'మాడీ' కాగా, 'లక్ష్మమ్మ తల్లి' లచ్చుమక్కగా మారింది. లేకపోతే, 'లచ్చుఁవమ్మతల్లీ! రాతిరి మా ఇంట్లోది వంట్లో నలతగా వుండాదని నూకలు నీళ్ళల్లో పొయ్‌లేదు. పొద్దన కూటినీళ్ళు కూడ లేఁవమ్మా!! కడుపుమంటతో కండ్లు బైర్లు కమ్మతా ఉండాయి!' అని ఆవుల వేళప్పుడు మాదిగ రాముడు బతిమాల్తే, 'ఉండరా! రాముడూ! వస్తున్నా' అంటూ వంటగదిలోకి వెళ్ళి, చింతగింజవేస్తే మునగని చిక్కని మజ్జిగలో అరముద్ద సంగటి కలిపి, వాడి దోసిట్లో పోసి, ఒక దబ్బ మామిడి కాయ ఊరుగాయ

చేతికందిస్తే, తుమ్మితే ముక్కుల్లో పడేదాకా మెక్కి, 'నూరేండ్లు చల్లంగా బతుకునాతల్లీ!' అని గొణుక్కుంటూ, చేతికి మిగిలిన సద్దిబువ్వ నాక్కొంటూ 'చేతులు కడుక్కోరా!' అంటే గూడ వినిపించుకోకుండా వెళ్ళిపొయ్యే రాముడు- 'రామయ్యా! చెప్పుపట్టెడ తెగిపోయింది. కాస్త కుట్టిపెట్రాదా!' అని అడిగితే, 'తొలికోడి కూసే యాళకాడ కూతేసినాడు కామసాని పెద్దబ్బ మోటబాన చినిగిపొయ్యిందంట! తొందరగా పోతాఉండా! రేపెప్పుడైనా రా సూద్దాం లచ్చుం వక్కా!' అని తప్పుకొనిపోతున్నా డీనాడు.

అయినా ఆమె బతుకుతూనే ఉంది!

అల్పస్వల్పమైన గుండెలైతే, పువ్వులమ్మిన చోట కట్టెలమ్మవలసి వచ్చినందుకు ఆమె ఏ నుయ్యో గొయ్యో చూసుకుండేది. కాని ఆమె ఆకోవకు చెందిన మనిషిగాదు. అందుకే ప్రతిదినం ఆమె కోడికూత వింటుంది. అంటే- అంతకుముందే నిద్రలేచి, కాసిన మంచినీళ్ళు నోట్లోపోసుకొని పుక్కలించి ఉమ్మేసి, గుడిసెముందు కసవు చిమ్మి, ముంతడు నీళ్ళు చల్లి, మూడు అడ్డగిర్రల్తో ముగ్గు అయిందనిపించి, ఆ మీదట ఉట్టిమీద బుడ్డిలోని ఆముదమంత అరచేతిలో వేసుకొని ఉచ్చికిరాసి, గంపనెత్తికెత్తుతుంది. ఇంతకూ ఆమె నిద్రపోయిందెప్పుడని?- ఉదయాన నీళ్ళలోపోసిన పప్పు రుబ్బి, వడలుగాల్చి, ఆ వేడిమీదనే గుగ్గిళ్ళు ఉడకబెట్టి, తమలపాకులు పేర్చి కట్టలుకట్టి పొగాక్కు కాస్త, పదునుచేసి గోనెపట్టలో చుట్టిపెట్టి, అన్నిటినీ గంపలో పొందుగా అమర్చి, ఆపై నాలుగు మెతుకులు ఉడకబెట్టి నోట్లో వేసుకొని, ఏ రెండవజాము దాటేవేళలో అలా నడుం వాల్చుతుంది.

కోడికూతతో బయలుదేరిన 'లచ్చుమక్క' పొద్దు నడిమిట్టకెక్కేటప్పటికి నాలుగైదు మైళ్ళలో ఉన్న ఓ అయిదారు పల్లెలు తిరుగుతుంది. అత్త చాటు కోడళ్ళు అరపడిరాగులతో 'ఆకువక్క' కొంటే, తల్లిచాటు పిల్లలు తవ్వెడు జొన్నలతో గుగ్గిళ్ళు కొంటారు. పొలంగట్టుమీదపడి నడుస్తూంటే, సద్దిబువ్వ తింటున్న రైతులు మిరపతోటలో వంకాయలో, కాసిని పచ్చిమిరప కాయలో కోసిచ్చి వడలు కొంటారు. గొర్రెలు కాచుకొంటున్న బుల్లోళ్ళు సోలెడు పాలిచ్చి పొగాకుకాడ కొంటారు. ఈ ఊరినుండి ఆ ఊరికి ఎంతదూరమో ఈ ఊరినుండి ఆ ఊరికి అంతే దూరమన్నట్లు, వస్తువులు మారినా దాదాపు బరువుమాత్రం అలానే ఉంటుంది. అదే బరువుతో ఆమె ఇంటి ముఖం పట్టుతుంది పొద్దునడినెత్తి కెక్కినపుడు!...

ఆ రాగిచెట్టు నీడలో ఆమె అలా చతికిలబడిందో, లేదో ఎప్పుడో మూతలుపడ్డాయి కండ్లు. అలసిసొలసిన శరీరానికి ఆ రావిచెట్టుబోదె హంస తూలికాతల్పమైనట్లుంది పాపం!

ఎంతో సేపు గడవలేదు ఆ విధంగా. అంతలోనే 'అంబా' అన్న రంకె చెవిని పడింది. అదిరిపడిలేచింది ఆమె! ఆ బాటమీద వెడుతున్న సవారిబండికి గట్టిన దాపటిగిత్త, కాలుగీరి ఖణిల్లని 'రంకె' వేసి మోర ముందుకు చాచడంతో అమాంతంగా బండి ఆమెవైపు మళ్ళింది. అంతలోనే చేతి కోల 'ఛళ్లు'మని ఎడమచేతి పగ్గాలు బిగుసుకుంటే దారితప్పిన బండి దారినపడింది రెట్టించిన వేగంతో! ఆ ఎద్దును అలానే చూస్తూ ఉండిపోయింది 'లచ్చుమక్క'.

ఆ ఎద్దు!- దాపటగట్టిన ఎర్రెద్దు. ముఖాన మూడునామాలు తీర్చి దిద్దినట్లు ముచ్చటగొలుపుతున్న ఎద్దు!- తాను లక్ష్మమ్మగా ఉన్న రోజుల్లో తోటిగంగులు పలమనేరు పరసలో పట్టుకొచ్చాడు పదిరూకలు సరసమని! అది ఏవిధంగా ఇల్లుచేరిందో దేవుడి కెరుకగానీ, వచ్చింది మొదలు మనిషిని దరిదాపులకు రానీయదు. అధవా ఎవరైనా ప్రయత్నిస్తే, ముంగాళ్లు రెండు పైకెత్తి పైనపడబోతుంది పొగరుమోతు గుర్రంలాగ! అందుకే తోటిగంగులుగాడు రెండు పగ్గాలతో దానిని గాటగట్టి ఒక వెదురుబొంగు కొన చీల్చి అందులో ఒక చట్టిగట్టి దూరంగా నిలబడి నీళ్ళు తాగించడం అంతకంటె దూరంగా నిలబడి పిడికెడు కసవు విదిలించడం చేస్తున్నాడు. ఒకనాడు లక్ష్మమ్మ కూలీలకోసమని వాడలో అడుగుబెట్టింది, అడుగు కదల్చ కుండా నిలబడింది. ఆ మీదట ముక్కుమీద వేలేసి గంగులయ్యను, "ఏవిఁటి సంగతి?" అని అడిగింది. గంగులయ్య ఓ కథంత ఉదంతంచెప్పి తల బాదు కొన్నాడు. ఏ మనుకొనిందో ఏమో లక్ష్మమ్మ- ఎద్దును సమీపించి మూపు తట్టింది. ఆ చల్లని చేతిచలవతో పొగరుబోతు తనానికి చలవలు కమ్మిందేమో?- అరమోడ్పు కన్నులతో ఆ ఎద్దు మోరముందుకు చాస్తే, పగ్గాలువిప్పి చేతపట్టుకొని, "గంగులూ! సాయంకాలం వచ్చి లెక్క తీసుకోరా!" అనింది, ఆ ఎద్దు పిల్లిలాగ వెంటపడ్తే! ఓ బాధ తప్పిన గంగులయ్య, "నాఆయుస్సు బోసుకొని నూరేండ్లు బతుకు తల్లీ!" అని రెండు చేతులెత్తి దండం పెడితే- వాడలో ఆబాలగోపాలం దవడలు నొక్కుకున్నారు, ఆ ఇల్లాలి దర్పంచూసి! ఆ నాటినుండి బిడ్డలాగ మేపించి ఆ గొడ్డును. పరిస్థితులు మారినా... పద్ధతులు మారినా... ఆ నోరులేని గొడ్డు మాత్రం తనని మర్చిపోలేదు. కానీ ఆ బండిలో పోతున్న వాళ్ళు?...

అదే బండిలో అదే బాటమీద తాను ఆ ఇంటికి కోడలై ఆ ఊళ్ళో అడుగుబెట్టిన నాటినుంటి భారతోత్సవాలకు ఏటేటా ఎన్నోసార్లు వెళ్ళింది. ద్రౌపదీమానసంరక్షణ కథ విని, ఆ రాత్రి నాటకం చూడాలనుకోవడమే తరువాయి! అంగిట మాట అంగిట ఉండగానే ఇంటి ముంగిట బండి నిలబడేది. రంగడు బండి కడిగి, ఆకులకు రంగుపూసి, వెదురు చాపలతో సవారికడుతూ ఉంటే- ఆయన వరి కసవు పరిచి దానిపై గోనెపట్టలేసి దానిపై ఈతాకు చాపలు పరిస్తే అది మెత్తని పరుపును తలపింపచేసేది. అంతటితో వదలకుండ ఎద్దుల్నికూడ కడిగించి కొమ్ములకు రంగు పూసి కుప్పులు తొడిగి మెడపట్టెలుగట్టి, సరిగంచుసుంగు తలపాగ రాజ ఠీవిని ఒలకబోస్తూంటే తానే స్వయంగా బండి తోలేవాడు. సేద్యగాడు రంగడు బండి ముందు ఒక్క లగువులో వెడుతూంటే వాడి పెళ్ళాం మంగి చంకబిడ్డ జారుతూఉంటే, "ఆబిడ్డనైనా ఇలా కూర్చోబెట్టే!" అంటే గూడ వినిపించుకోకుండా. "నాకిదేం లెక్కలేమ్మా!" అంటూ బండి వెంటబడేది! వాళ్ళే! రంగడు వాడి పెళ్ళాం మంగి ఆనాటి తనస్థానంలో!..."

ఎవరో గుండెలపై గునపాలతో బాదినట్లయితే ఆపై ఆలోచించలేక పోయింది. బండి ఒక్కమూంపులో బొట్లవారిపల్లెమిట్ట ఎక్కుతూంటే ఎద్దుల మెడ పట్టెల్లోని చిరుగంటలనాదం లీలగా వినిపిస్తూ ఉంది. ఇక అక్కడ ఉండలేక ఉండి ఆ దృశాన్ని భరించలేక, ఆమె గంపనెత్తి కెత్తుకొనింది!

ఆమె నడుస్తూ ఉంది!.... ఆలోచనలు వెనక్కు నడుస్తున్నాయి.

ఆరోజూ-

తనకు బాగా జ్ఞాపకం. ఆరోజు కూడ తూర్పున్నే అదే చింతచెట్ల మాటున పుట్టింది పొద్దు. పడమటి పక్కనే బోడిగుట్టల వెనుకనే కుంకింది. తన పిచ్చిగానీ ఆరోజు మాత్రమేనా?- తనకు బుద్ధి తెలిసిననాటి నుండి ఆ విధంగానే జరుగుతూ ఉంది. ఆ గమనంలో ఏమాత్ర మైనా కుంటుపడినట్లు తనకు తెలియదు. చెప్పగా వినలేదు. ఒక్క పగటి కథలో పండితుడు తప్ప. ఆయనకూడ చూడలేదట! ఎవరో ఒక మహాసాధ్వి! తనభర్తకు జరగబోయే ముప్పును తలుచుకొని సూర్యుడి గమనాన్ని ఆపేసిన సంగతి ఒకరు పద్యరూపంలో పారాయణం చేస్తే తాను ఒకకథలాగా చెప్పాడు. అంతే!- ఆ గతితప్పనిలయలో ఇలాంటి ఎన్ని అపశ్రుతులు దొర్లిపోతున్నాయో?

తన ఆలోచనలు తనకే విపరీతంగా తోస్తే ఒక్కసారి నవ్వుకొనింది లచ్చుమక్క.

ఆ రోజు ఆయన మంచంమీద నిర్జీవంగాపడి ఉన్నాడు. ఊరు ఊరంతా ఒకటై ఇల్లు నిండిపోయింది. మాంత్రికుని చేతుల్లో వేపమండలు గిరికీలు కొడుతున్నాయి. కసక్కమని నోటితోనే కోడిపుంజు గొంతుకొరికాడు. ఆ రక్తంతో తాను తీర్చిన బొమ్మకు మూడుసార్లు దిగతీశాడు. ఆ కోడిని చంకనబెట్టుకొని పైగుడ్డతో ముసుగేసి మీసం మెలేస్తున్నాడొక భూతవైద్యుడు. సుమారు ఏడాది కిందట పాతగుంటలో మకాంపెట్టి వైద్యం సంగతి అలా ఉంచి హస్తవాసిలో అఖండ పేరుప్రఖ్యాతులు గడించిన ఇంగ్లీషు వైద్యుడు సూదిమందు తయారు చేసుకొంటున్నాడు. ఎక్కడినుండి ఊడి పడ్డాడో నాటువైద్యుడు శీపాటి వెంకటరెడ్డి, ఒక్క ఊపులో జనాన్ని చీల్చుకొని లోపల జొరబడ్డాడు. ఆయన చేతిని తన చేతిలోనికి తీసుకొన్నాడు. నాడి పరీక్షలో మునిగిపోయాడు. తప్పతాగి తూలుతున్నా తప్పుపలకని నోరు వెంకటరెడ్డిది. అక్కడి 'హంగామా' అంతా ఒక్కసారి తేరిపార చూశాడు. ఒక్క వెర్రి నవ్వు నవ్వుతూ "మీకేం పిచ్చిపట్టిందట్రా! ఎర్రినాయాలి గుంపా!... ఇంకొక్క గెంటేరా అబ్బకు! ఆ మిందట... అంతే!!" అంటూ వచ్చిన వాడు వచ్చినట్లుగ వెళ్ళిపోయాడు- లేదంటే ఆ పిచ్చి నవ్వును పొడిగిస్తూ.

"అయ్యో! ఇదేం మాయదారి రోగంవమ్మా! ఎంతమంది వైదిగులు?... ఎంత మందు!... ఎన్ని రూపాయలు! ఏం కత? దీని అంతే తెల్లేదు! ఏంవి కలికాలంవో? ఏం రోగాలో?" అని వాపోయింది అక్కడ గుమిగూడిన అమ్మలక్కల్లో రామలక్ష్మమ్మ.

రంగడు తలదగ్గర కూర్చొని తల బాదుకొంటున్నాడు. తాను ఓ మూల కూర్చొని తపించిపోతూ ఉంది. ఆ ఇంట్లో అడ్డదిడ్డమైన పనులతో అటు యిటూ తిరుగుతూ ఉంది రంగడి పెళ్ళాం మంగి. రామలక్ష్మమ్మ మాటలు తన చెవుల్లో పడ్డాయి. నిజమే! ఎంతోమంది వైద్యులను పిలిపించింది. ఎన్నో మందులు ఇప్పించింది. చెప్పిన దేవుడికంతా ముడుపు గట్టింది. రూపాయను పైసాలాగ చూసింది. ఫలితంగా అంతుచిక్కని రోగం వైద్యులకు, అంతు తెలియని ఆయన నడవడి తనకు మిగిలాయి!

నడవడి అంటే జ్ఞాపకం వస్తూ ఉంది. వెనకాముందు ఎవ్వరు లేని ఆ ఇంట్లో కొత్తకోడలుగా 'బిక్కుబిక్కు' మంటూ అడుగుబెట్టింది. లంకంత ఆ కొంప... ఒంటరిగా ఆయన... ఆ ఇంటి ఆవరణలో గుడిసెలో రంగడు వాడి సంసారం... ఏవిధంగా కాలం గడుస్తుందో అని భయం భయంగా ఉంటే, ఆ భయాన్ని ఆయన పరిష్కరించారు చాల చిత్రంగా! "చూడులక్ష్మీ! పొలంలో మడక కట్టుతాము. ఎడమచేత పగ్గాలుబట్టి, కుడిచేత ములుకోలపట్టితే, మడక చెప్పినట్లు తిరిగి పొలాన్నంతా దుక్కి చేస్తుంది. ఆ పొలంలో పంట, పగ్గాలు చేతబట్టినవాడి ప్రతిభమీదనే ఆధారపడి ఉంటుంది. ఈ సంసారానికి నీవూ అంతే!" అంటూ ఇనప్పెట్టె తాళాలు తనచేతికిచ్చాడు. గుండెకోసి అరచేతిలో పెట్టడం, పువ్వుల్లో పెట్టి పూజించడం లాంటివి యథాతథంగా జరగకపోయినా అంతకంటే మిన్న గానే భావించింది తన కాపురాన్ని. ఆ రోజునుండి వరి నాటడానికి కూలీలు కలుపుతీయడానికి మనుషులు...... అంతా తన చేతిమీదనే సాగింది. మెట్టినింటి కీర్తి పుట్టినింటివరకు ప్రాకి కన్నపేగులు కమ్మని ఊహల్లో తేలిపోయాయి. కానీ విధివైపరీత్యం!...

అప్పటికి సరిగ్గా అయిదు సంవత్సరాలక్రితం "ఇదో! రెండు రోజుల్లో తిరిగిరానూ!" అంటూ ఏదో పనిమీద గ్రామాంతరం వెళ్ళిన ఆయన సుమారు పదిహేను రోజులవరకు తిరిగిరాలేదు. తనకు పెండ్లి అయిన నాటి నుండి చూస్తూనే ఉంది– ఆ విధంగా ఎప్పుడూ జరగలేదు. నూరు ఆరయినా, ఆరు నూరయినా ఆయన నోరుజారని మాటకారి. అందుకే ఆలస్యాన్ని ఆలోచించలేక మనసు పరిపరివిధాల పోతూ ఉంటే, ఆ రోజు రాత్రి ఎనిమిది గంటలై ఉంటుంది. తాను పుట్టింటినుండి తెచ్చుకొన్న భాగవతాన్ని దీపం ముందుంచుకొని కూర్చొనింది నాలుగు పద్యాలైన చదువు కొందామని. అలా కూర్చొనిందో లేదో, 'ఖణిల్లని' రంకె చెవిని పడింది.

ఎప్పుడైనా ఏదైనా విడ్డూరం జరిగితేగానీ, ఎర్రెద్దు ఆ విధంగా 'రంకె' వేయదు. ఏం జరిగిందో ఏమో అన్న సంశయంతోనే పుస్తకాన్ని మడిచిపెట్టి తాను కొట్టంలోకి వెళ్ళింది. అక్కడి పరిస్థితిని చూచి అలానే మాన్పడిపోయింది!

సాధారణంగా మనిషికంటే ముందు ఆయన పిలుపు చెవుల్లో పడేది. ఉన్నపళంగా వచ్చి ఎదటపడితే ఎంతో పొంగిపోయే వారాయన. అలాంటమనిషి ఎప్పుడు వచ్చారోయేమో? సద్దుసడీ లేకుండా వచ్చి కట్టు బట్టలైనా విప్పకుండా కొట్టంలో మంచం వాల్చుకొని పడుకొన్నారు. అది గూడ రంగడు పడుకొనే మంచంమీద!

అంతకంటే వేగంగా ఆలోచనలు!!

'ఒక వేళ తన పొరపాటు అతనికంట పడిందేమో! అందుకేనేమో, ఈ మానసికమైన బాధ!– అటువంటి అవకాశమే లేదే? అసలు వారు ఊళ్ళోనే లేరుగదా? తాననుకొన్నట్లు అతని కంటబడిఉంటే కత్తికికండజేసి పొలిచల్లే అభిమానధనులే! తన గిలిగానీ, అలాంటిదేమీ కాదు. ప్రయాణంలో ఏదో అవాంతరం జరిగి ఉండవచ్చు. అని తన్ను తాను సమాధానపరచు

కొనింది. అతని దగ్గరికి వెళ్ళింది. "ఏఁవండీ ..... ఏవిఁటీ అన్యాయం? ఇంతకూ ఎప్పుడు రావడం? ఎందుకిక్కడ పడుకొన్నారు? లేవండి!" అని బతిమాలింది. ఏడ్చింది. తలతలా కొట్టుకొనింది. కానీ ఆయన కదిలీ మెదల్లేదు. తీక్షణమైన ఆ చూపుల్లో మార్పు కనబడలేదు. అంతే! "లబో దిబో" మని మొత్తుకుంటూ కుప్పగ కూలిపోయింది తాను!

కొంపలకు నిప్పంటుకొన్నా, మేడలమీద నిలబడి వేడుకచూడడానికది పట్టణంకాదు. చీమ చిటుక్కుమంటే, గుండెలు కలుక్కుమనే పల్లె మనస్తత్వం! ఇరుగు పొరుగు గుంపుగూడారు. ఎక్కడున్నాడో ఏమో రంగడు ఒక్క లగువులో వచ్చి అక్కడ వాలాడు. దిష్టి తగిలిందని గాలిసోకిందని తలకొక్క తీరుగ మాట్లాడుతుంటే భూతవైద్యుడు లిక్కి మునెప్పను పిలవమన్నారెవరో! ఆ మాటతో అతనికోసం పరుగెత్తాడు రంగడు. ఒకరు దిష్టి తీయ మంటే, ఒకరు ఎఱ్రనీళ్ళు దిగదీసి పొయ్‌మంటున్నారు. వేపమండకోసం ఎవరో పరుగెత్తారు.

అంతలోనే అనుకోనివిధంగా ఆయనపైకి లేచారు!

"నాకేం భూతం, గాలి, దెయ్యం సోకలేదు. మీరు వెళ్ళండయ్యా!" అని విసుక్కున్నాడు. సాధారణంగా ఎంతో నెమ్మదిగా, నేర్పరితనంగా మాట్లాడే మనిషి, ఆ విధంగా చీదరించు కొనేసరికి, "నిజంగా ఇది భూత లక్షణమే!" అన్నాడు ఒక నడికారాయన.

"మీ కేనయ్యా చెప్పేది. నాకేమీ జబ్బులేదు. మీరు తప్పించి, నన్నేమీ భూతాలు, దెయ్యాలు పట్టలేదు. కాసేపు ప్రశాంతంగా ఉండనీయండి. మీరు వెళ్ళండి సామీ!" అని చేతులెత్తి దండం పెట్టాడు ఆ చెయ్యెత్తు మనిషి! ' 'ఇది మరీ బాగుండాదే వరస' అని గొణుక్కుంటూ ఒక్క రొక్కరుగ వీధిని బడ్డారు.

ఆయన విసుగ్గా ఇంట్లో అడుగుపెట్టారు. విసుగ్గానే నాలుగు ముంతలు నీళ్ళు పైన కుమ్మరించుకొన్నారు. అంతకంటే విసుగ్గానే నాలుగు మెతుకులు ఎంగిలిపడ్డారు. అంతే! ఆ రోజునుండి అదే వరస. తింటే తింటారు. లేదా లేదు. ఇష్టముంటే పొలంవైపు పోతారు. లేకుంటే లేదు. ఎవరేమి అడిగినా మారేమి మాట్లడినా మౌనమే సమాధానం. లోపంలేని తన ప్రయత్నంలో కూడ గంటలు, దినాలు, నెలలు గడిచిపోయాయి. వచ్చిన భూతవైద్యులు ఇచ్చిన మందులు ఫలితాన్ని చూడలేక తన బతుక్కే పరీక్ష పెట్టాయి. ఆ పరీక్షకు తట్టుకొని నిలబడడమే దుర్భరమయి పోయింది.

రోజులు దొర్లిపోతున్నాయి. పాచిన కూడులాగ ఆయన ఆరోగ్యం కూడా క్షీణదశ పట్టింది. రాత్రిపూట ప్రశాంతంగా ఆయన పడుకొన్న సమయాన దగ్గర చేరడానికి ఒకటి రెండుసార్లు ప్రయత్నించింది. ఆయన విముఖుడై వెళ్ళిపోయేవాడు. దాంతో ఆ రాత్రి ఆయన మళ్ళీ ఎప్పుడైనా రావచ్చు. వచ్చి అంత ఎంగిలిపడితే పడవచ్చు. లేదా, అలాగే పడి నిద్రపోవచ్చు. అయినా తానేమీ పలకడానికి లేదు. అర్ధాంగిగా తన హక్కు రద్దయిపోయింది. ఆలోచిస్తే ఆడదానికి ఇంతకు మించిన శిక్ష ఉండదేమో? ఇది తలచుకొన్నప్పుడంతా తన గుండె చెరువయ్యేది. ఆ గుండెభారంతో నిద్ర దూరమయ్యేది. అలా ఎన్నో రాత్రులు గడిచిపోయాయి,

తాను మేడమీద నిలబడి లోకాన్ని చూస్తూ ఉండగానే!– లోకం! పిచ్చిలోకం... అనుకొంటూ ఉంటుంది... తన ఆస్తిపాస్తులకు అంతస్థు గట్టి తనది అందాలకాపురమని! కానీ వాళ్ళకేమీ తెలియదు. దూరంనుండి చూస్తే నునుపు దేరిన కొండలు ఆకాశం ఒక్కటైపోయి ఓ అర్ధవృత్తాకారాన్ని గీచినట్లు తోస్తుంది. కానీ ఎక్కడ కొండలు?... ఎక్కడి ఆకాశం?... తన బ్రతుకుకూడ అలాగే తయారయింది. అయినా ఆ బ్రతుకును అలాగే నెట్టు కొస్తూఉంది, 'ఏనాడైనా గట్టు చేరలేకపోతామా!' అన్న నమ్మకంతో– కానీ ఆ విశ్వాసం ఆనాటితో...

"అదుగో! ఆయన కన్నులు తెరిచారు" అన్నారెవరో!

అందరు మంచం చుట్టు గుమిగూడితే అందరికంటే ముందు తాను ఆయన తలదగ్గర నిలబడింది. ఎప్పుడూ లేనిది ఆయన కండ్లు రెండు నిండుగా ఉన్నాయి. ప్రయత్నపూర్వకంగా తల దిండువైపు చూపులుంచి చేతిని అటు తిప్పబోయారు. అది గమనించిన తాను దిండుకింద వెదికింది. అక్కడ ఓ పొడవైన కవరు చేతికి దొరికితే తాను తీసుకొనింది. ఆయన మెల్లగా ఆ కవరును అందుకొన్నారు. ఒక సారి తన్ను... ఒకసారి మంచ కాలికి తల ఆనించి ఏడుస్తున్న రంగణ్ణి మార్చి మార్చి చూశారు. ఆయన భావం, బాధ ఎవ్వరికి అర్థం కాకుండా బొమ్మల్లాగ నిలబడి ఉంటే, ఆయన ఆ కవరును రంగడి చేతిలో పెట్టారు.

'లక్ష్మమ్మ అదృష్టం! గండం గడిచిపోయిందని' కొందరంటే, 'అది గాదయ్యా, ఇది చావు తెలివని' కొందరన్నారు. ఏది యేమైనా భూత వైద్యుని చేతిలోని వేపమండ మరింత వేగాన్ని పుంజుకొంటే ఆ గాలి ధాటికి తట్టుకోలేక అక్కడి దీపం 'గుటుక్కు' మనింది.

అందరూ ఒక్క సారి గొల్లుమన్నారు!.........

"చూడమ్మా! పోయినవాళ్ళతో కలిసి మనం పోలేం. అంతా ఋణం. ఆ ఋణం తీరిపోతే ఎవరికెవరు? ఎవరిదోవ వాళ్ళదే తల్లీ! దిగులు పడి కూర్చొని సాధించగలిగింది మాత్రం ఏముంది?"

కర్మక్రియలన్నీ జరిగిపోయిన తరువాత ఊరు వెళుతున్న తండ్రి సముదాయించే ప్రయత్నం. తాను బదులు పలకకపోతే మళ్ళీ ఆయనే–

"అమ్మడూ! అల్లుడి చేసిన పని నాకేమీ అర్థంకాలేదు. అసలు ఆ విధంగా చేయవలసిన అవసరం ఏమి గలిగిందో ఎంత ఆలోచించినా బుర్రకందలేదు."

"మీకేగాదు నాన్నా! నాకూ అర్థం కావడంలేదు ఆయన ఎందుకీ విధంగా చేసిపోయారో!" ఏదో మంచి సమాధానం చూపగలిగింది కానీ, కన్న కడుపుకే కడుపు చింపి చూపలేకపోయింది.

"అదేనమ్మా నేనూ అనేది! లోకంలో లేనివిధంగా చేసిపోయాడు. బతికినంత బతుకు బతికి కడకు సేద్యగాడి చేతుల్లో నీ బతుకు పెడతాడని కలలో గూడ ఊహించలేదు. నా మాట వినుతల్లీ! రంగడు మంచివాడే కావచ్చు కానీ డబ్బు!– దాని గాలి సోకకుండానే ఉండాలి. సోకిందంటే ఇక దానికి అంతంలేదు. దయ, ధర్మం, నీతి, నియమం అన్నీ ఆ డబ్బుముందు తల వొగ్గాల్సిందే!"

"అయితే నన్నేం చేయమంటారు నాన్నా!"

"నువ్వేమీ చేయాల్సిన పని లేదమ్మా! 'ఊఁ!' అను. మూడు కోర్టుల కెక్కించి మూడు చెరువుల నీళ్ళు తాగిస్తాను. నాకు తెలియని చట్టమేముంది? వీడి పేరుతో వీలునామా ఉంటే సరిపోతిందా?"

మహాదీలక్ష్మమ్మ సందిగ్ధంలోపడింది– అయితే పడినంతసేపు పట్టలేదు బయటపడడానికి!

డబ్బు మహిమ... రంగడి ప్రవర్తనలో మార్పు... కోర్టుల కచ్చేరీలు... ఈ మాటలు మెదడును తాకకముందే అంతరాత్మ మేలు కొనింది.

"నువ్వనుకొన్నావ్ చేసిన తప్పు ఎవరికంట్లో పడలేదని! కానీ ఆయన కంటపడింది."

"నిజమా?"

"అవును. అందుకే ఆ మనోవేదనతోనే ఆయన కుళ్ళి కుళ్ళి కన్ను మూశారు".

"నేనేమీ కంటికావరంతో తప్పు చేయలేదు. కడుపుతీపి నన్ను పురికొల్పింది. ఆయన దృష్టిలో అది తప్పుగా తోస్తే నన్ను దండించవచ్చు గదా!"

"ఆయన దృష్టికేగాదు– హైందవ సంప్రదాయానికి, సాంఘిక నియమానికి నీ ప్రవర్తన గొడ్డలిపెట్టు. ఆయన మహా ఉత్తముడు. దూరదృష్టి కలవాడు. ఇంతకాలం అతనితో కాపురంచేసి ఆ మాత్రం గ్రహించలేక పోయావా! నిన్ను కించపరచి తాను కించపడదలచు కోలేదు. కాబట్టే కిక్కురుమనకుండా ఆబాధను భరించాడు తనలోతాను. అయినా, ఆయన నిన్ను దండించలేదని భావిస్తున్నావా?"

"అవును మరి!"

"హ్హాహ్హాహ్హా! పిచ్చిదానా! ఈ ఆస్తిపాస్థుల్ని రంగడిచేతుల్లో పెట్టడంలోని అంతర్యం ఏమనుకొన్నావ్? ఈ సంపద తనది కావడంతో వాడి కళ్ళు నెత్తికెక్కుతాయి. అప్పుడు ఎంత ప్రయత్నించినా వాడి కళ్ళల్లో నీవు పడవు. వాడి పెళ్ళాం నిన్ను కుక్కకన్నా హీనంగా చూస్తుంది. ఆ వాతావరణంలో నువ్వు ఇమడలేవు. కడుపు చేతబట్టుకొని బయటపడితే అప్పుడు తెలుస్తుంది కడుపుతీపి!"

"ఆఁ! ఇదా ఆయన ఉద్దేశం! అయితే మరో జన్మ యమలోకం లాంటి మరో లోకం ఉన్నాయో లేవో నాకు తెలియవు. నా తప్పుకు ప్రాయశ్చిత్తం ఈ జన్మలో జరిగితీరాల్సిందే!"

"ఏమిటమ్మా ఆలోచిస్తున్నావ్?"– తండ్రి పిలుపుతో అంతరాత్మ అదిరిపడి ఆగిపోయింది. సమాధానం చెప్పాల్సిన బాధ్యత తన మీద పడింది.

"నాన్నా! నా చేతుల్లోకంటే రంగడి చేతుల్లోనే ఆస్తిపాస్థులు భద్రంగా ఉంటాయని ఆయన అభిప్రాయమైతే అలాగే జరగనీ! బతికినంతకాలం ఆయన ఆత్మకు శాంతి కరువైపోయింది. ఇంకగూడ ఆయన ఆత్మను బాధపెట్టలేను– మీతో సహకరించి. ఒక వేళ రంగడి ప్రవర్తనలో మార్పు అంటూ వస్తే అది నా మేలుకే!"

"బతుకు ఉపన్యాసాల వేదికగాదు తల్లీ!- నీతినియమాలు వల్లించడానికి. బాగా ఆలోచించుకో. కడుపు తీపి చెడ్డది కాబట్టి ఇంతగా చెప్తున్నాను. వెన్నుమీద గువ్వలా పెరిగిన బిడ్డవు. ఈ బాధను తట్టుకోలేక...."

"నాన్నా! అంత సులభంగా చస్తే ఈ జన్మకు విముక్తి లేదు. బడిలేని ఒక మారుమూల పల్లెలో కన్నతండ్రి బాధ్యతలేగాక, బడిపంతుల బాధ్యతను గూడ నెత్తికెత్తుకొన్నారు కాబట్టే, ఈ జన్మకు ఈ మాత్రం అక్షరజ్ఞానం అబ్బింది. అప్పుడు నేర్పారు వాక్యమంటే అర్థం. అప్పుడు అర్థం వాక్యానికే పరిమితమనుకొన్నాను. కానీ ఇప్పుడు గ్రహిస్తున్నాను. అది జీవితానికే అర్థమని!"

తన ధోరణి అర్థం కాకుండా తండ్రి నివ్వెరపడి నిలబడితే- తానే పూర్తిచేసింది. తాను 'కర్త' అయి చేసిన పని 'క్రియ' అయితే, జరగాల్సిన ఫలితం 'కర్మ' అని! తన మాటలు రుచించకపోగా, తండ్రి కోపంతో అంతా గ్రహచారం మీదికి నెట్టి వెళ్ళిపోయాడు.

అంతే! ఆ తరువాత ఆయన మాటలు నిజం కావడానికి ఎంతో కాలం పట్టలేదు. నెలలు తిరగకముందే రంగడు ఆ ఇంటి యజమాని! ఆయనగారి సతీమణి సర్వాధికారిణి!! ఇక తన పాత్ర ఇత్తడి రాగి పాత్రలు పరిచయానికి దిగేటట్లు తోచింది ఆ సాధింపులు చాటుపోటు మాటలు వినేసరికి! అంతే! కాసంత నీడకు మకాం ఊరికి ఉత్తరాన పూరి గుడిసెకు మారితే జానడు పొట్టకోసం గంపనెత్తికెక్కింది!...

ఆమె నడుస్తూనే ఉంది!

ఆలోచనల్లో దోవ జరిగిన సంగతి తెలియనేలేదు. ఎప్పుడో తన పూరిగుడిసెలో అడుగుబెట్టింది. ఊసూరుమంటూ నెత్తిగంప నేలకు దించింది. గత స్మృతులతో మనసు వికల్పమైతే, అక్కడే- ఆ గంప ప్రక్కనే నేలకు వాలిపోయింది, ఇంతవరకు నెత్తికి చుట్ట అయిన పైట చెరగు నేలమీద పరుపుకాగా! అలా ఎంతోసేపు గడవలేదు. ఆ బలహీనత ఆమెలో ఎంతోసేపు నిలవలేదు, కర్తవ్యం మళ్ళీ ముందుకు లాగితే ఆమె పైకి లేచింది. ఎంత ప్రయత్నించినా ఆలోచనలు ముసురుకొంటూనే ఉన్నాయి- ఉట్టిమీద కూటినీళ్ళచట్టిని ఎర్రచీమలు ముసురు కొన్నట్లు! గంపలోని సంచినితీసి ముందర వేసుకొనింది. అది పాతగుడ్డల్తో కుట్టిన నాలుగైదు పొరలుగల సంచి. పల్లెటూళ్ళల్లో తిరుగుతూ ఆకు వక్క అమ్ముకొనేటప్పుడు ఒకావిడ వడ్లు పెడితే, మరొక మగువ రాగులుపెడుతుంది. ఒక్కొక్క రకం గింజల్ని ఒక్కొక్క పొరలో పోసుకొంటుంది. ఆ విధంగా పోసేటప్పుడు ఎంత జాగ్రతపడినా ఒక పొరలో గింజలు మరొక పొరలో పడకపోవు. ఇంటికి వచ్చిన తరువాత నెమ్మదిగా కూర్చుని ఆ గింజలను వేర్పరచుకొని కుండల్లో భద్రపరచుకొంటుంది. ఆ రోజు ఒక్కొక్క పొరనే ఖాళీ చేస్తుంటే- రాగులు పోసిన పొరలో కాసిని వడ్లు కనుపించాయి. వాటిని ఆమె కిందపోసింది. పైట చెరగును చుట్టగాచుట్టి పిడికిడు నిండికి పట్టుకొనింది. ఆ ధాన్యం మీద ఆ చుట్టను అలా వత్తి, పైకి లేపితే వడ్లు మాత్రం ఆ చుట్టకంటుకుంటాయి. ఆ తర్వాత ఆ చుట్టను పక్కకు తీసి అలా

తట్టితే వడ్లగింజలన్నీ రాలిపోతాయి వేరుగా. ఆమె ఆ గింజలను వేరుచేస్తూ ఉంది- కాదు. కర్మ సిద్ధాంతంతో పాప పుణ్యాలను వేరుచేస్తూ ఉంది- వాటిని కన్నీళ్ళు ప్రక్షాళనం చేస్తూ ఉంటే!...

నెత్తిమీద రాగిఆకుమోపు కుంగదీస్తూంటే... మేక ముందుకు లాగుతూంటే... భుజం మీద దోటి నడకతో పోటీ పడుతూంటే- అడుగు ముందుకు వేయలేక అవస్థపడుతున్న రాముడు కంటపడ్డాడు.

సాధారణంగా రోజూ అయితే ఎక్కడిపని అక్కడ వదిలిపెట్టి ఒక్క ముంపులో వెళ్ళి మోపు దించుకొని మేకనుదీసి గుంజకు కట్టి గంపలో మిగిలిన కాసిని గుగ్గిళ్ళు లేదా, రెండు వడలు వాడి చేతిలో పెట్టి ఎంతో అప్యాయంగా ఎదకు హత్తుకొని 'ఏనాటికైనా నా బిడ్డకు మంచికాలం రాకపోదులే!' అని సంతృప్తి పడేది.

కానీ ఆ రోజు ఆమె మనస్సులో మనస్సులేదు.

మమకారం నశించిపోయింది. 'అమ్మా!' అని పిలిపించుకోవాలన్న ఆశతో తాను రాముణ్ణి కనుక్కొన్నా, రాముడు ఆయన బిడ్డగాదు. ఆయన బిడ్డయితే ఆయనలాగే బతికేవాడు.

వాడు రంగడి బిడ్డ!

అందుకే రంగడిలాగే బతుకుతున్నాడు!!- అన్న మనసులోని భావం మాటల రూపాన్ని సంతరించుకోలేక నిట్టూర్పుగా మారి గుండె తేలికపడితే కర్తవ్యం భుజం తట్టి బుజ్జగించి ఆ మరునాటి నడకను గుర్తుచేసింది. ఆమె లేచింది. నైరాశ్యం పెదాలమీద చిరునవ్వు సంతకంతో జీవితంపై ఒక సవాలు విసిరితే తన ప్రయత్నాల్లో పడింది.

ఆమె నడుస్తూనే ఉంది! ●

భారతి
(1, సెప్టెంబర్ 1965)